నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శనివారం 28 డిసెంబర్ 2024 | JAGTIAL

# సర్వే.. కట్టడికా.. సక్రమానికా..?



- అధికారులు పరిశీలిస్తున్నా తగ్గని అక్రమ నల్లాలు
- కాంట్రాక్టు సిబ్బంది చేతిలోనే పెత్తనం!
- ఇంజినీరింగ్ అధికారులపై ఆరోపణలు
- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- కార్పొరేటర్ ఫిర్యాదుతో ఫిట్టర్‌పై బదిలీ వేటు

**కరీంనగర్ నగరపాలక సంస్థలో ఏటా అక్రమ నల్లా కనెక్షన్ల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. వీటిని కట్టడి చేయాలన్న పేరుతో ఇంజినీరింగ్ అధికారులు ప్రతి ఏటా సర్వే చేపడుతున్నా ఫలితం ఉండడం లేదు. పైగా అక్రమ కనెక్షన్లను సక్రమం చేసుకోడానికే ఈ సర్వే చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 27 : కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో నల్లాల అక్రమ కనెక్షన్లు లేకుండా చేయడంతోపాటు ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఉండాలన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ₹100కే కనెక్షన్ ఇచ్చింది. అయినా, అక్రమ నల్లాల విషయంలో బల్దియాలోని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది అడ్డదారిలో వసూళ్ల దందాగా మార్చుకుంటున్నట్టు తెలుస్తున్నది. కనెక్షన్ల మంజూరు విషయంలో కాగితాలపై అనేక నిబంధనలు పెట్టిన ఉన్నతాధికారులు.. క్షేత్రస్థాయిలో మాత్రం పట్టింపు లేన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా అక్రమ కనెక్షన్లు ఇచ్చిన తర్వాత ఆ అధికారులే దానిని సక్రమం చేస్తారు కదా..? అన్నట్టు పరిస్థితి మారింది. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతున్నది.

## కాంట్రాక్టు సిబ్బందిదే పెత్తనం!

నగర ప్రజలకు ఎంతో కీలకమైన మంచినీటి సరఫరా విభాగంలో కాంట్రాక్టు, ఎన్ఎంఆర్ సిబ్బందిదే పెత్తనం సాగుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా ఆయా రిజర్వాయర్ల వారీగా డీఈ, ఏఈలున్నా క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు చేపట్టడం లేదని, నల్లా కనెక్షన్ల ఫైల్స్‌పై సంతకాలు చేయడమే తప్ప పరిశీలన ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కనెక్షన్లు అందించే విషయంలో అంతా కాంట్రాక్టు సిబ్బందిదే నడుస్తుందని, ఎక్కువగా గుంతలు తవ్వే కూలీలే నేరుగా కనెక్షన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మెయిన్ పైపులైన్లకు నిబంధనలకు మించి కనెక్షన్ల సంఖ్య ఉన్నట్టు సమాచారం. కమర్షియల్ నల్లాలు ఉండాల్సిన ప్రాంతంలో గృహ అవసరాల కనెక్షన్లు, అపార్ట్‌మెంట్లకు నిబంధనలకు విరుద్ధంగా సైజు మార్చి కనెక్షన్లు ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఈ దందాలో కింది స్థాయి సిబ్బంది నుంచి డీఈ స్థాయి అధికారి వరకు ముడుపుల దందా నడుస్తున్నదన్న ఆరోపణలున్నాయి.

## ఏటా సర్వేలు

నగరపాలక సంస్థలో ఏటా ఏదో సమయంలో అక్రమ నల్లా కనెక్షన్ల సర్వే పేరిట ఇంజినీరింగ్ అధికారులు పనులు చేపడుతున్నారు. సుమారు నెల పాటు ఈ సర్వే చేస్తూ, అక్రమాలను గుర్తిస్తే వాటిని క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అక్రమ నల్లా కనెక్షన్లు ఎలా ఇస్తున్నారన్న విషయంపై మాత్రం దృష్టి పెట్టటం లేదు. అయితే ఏ విభాగం సిబ్బందిపై అయితే ఆరోపణలు వస్తున్నాయో అదే విభాగంతోనే సర్వే పనులు చేయిస్తుండడం ఆరోపణలకు తావిస్తున్నది. ఆ కారణంగానే అక్రమం కాస్తా సక్రమం అవుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఫిర్యాదుతో ఫిట్టర్ బదిలీ

నగరంలోని హైలెవల్ జోన్ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఫిట్టర్ దానయ్యపై అక్రమ నల్లా కనెక్షన్లు, ఇతర విషయాలపై కార్పొరేటర్ రాపర్తి విజయ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దాంతో ఆయనను అక్కడి నుంచి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ముందస్తుగా అక్రమ నల్లా కనెక్షన్లపై సర్వే చేయడంతోపాటు సంబంధిత ఏరియాల సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు లేకుండా ఏటా సర్వేల వల్ల ఫలితం ఏముంటుందన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించండి

కరీంనగర్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచులు ప్రభుత్వాన్ని కో రారు. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసన లు చేపట్టారు. పలుచోట్ల మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నదని, బిల్లులు చెల్లించకుంటే గ్రామపంచాయతీలకు తాళం వేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టే పరిస్థితిలో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక వేధింపులకు గురవుతున్నామని తెలిపారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు.



మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ సర్పంచులు

# క్యాన్సర్ పేషెంట్లకు మెరుగైన వైద్యమేది?



- కరీంనగర్ జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- పూర్తి స్థాయిలో అందని సర్కారు వైద్యం
- నిరుపేదలకు భారంగా ప్రైవేట్ చికిత్స
- ఇతర ప్రాంతాలకు వెళ్లలేక.. ఖర్చు భరించలేక ప్రాణాల మీదికి..
- ఆందోళన కలిగిస్తున్న మరణాల శాతం
- మొదటి దశలో గుర్తిస్తేనే ప్రాణాల నిలిపే అవకాశం
- క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు డిమాండ్
- వైద్యుల ప్రతిపాదనలు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

**ఇటీవలి కాలంలో క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం కలవరపెడుతున్నది. కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఏటా 35 వేల మంది రోగులు చికిత్స పొందుతుండడం, అందులో చాలా మందికి పూర్తి స్థాయిలో వైద్యం అందక మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. వైద్య చికిత్స కోసం ఖర్చు భరించే స్థోమత లేకపోవడం.. ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానలకు వెళ్లే పరిస్థితి లేకపోవడం నిరుపేద రోగుల ప్రాణాల మీదకు వస్తున్నది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు అనివార్యమవుతున్నది. అందుకు అనుగుణంగానే సర్కారు వైద్యులు ఇటీవల ప్రతిపాదనలు కూడా చేసినట్టు తెలుస్తుండగా, ప్రభుత్వం వెంటనే స్పందించాలనే డిమాండ్ వ్యక్తమవుతున్నది.**

కరీంనగర్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)/ విద్యానగర్ : కరీంనగర్ జిల్లాలో క్యాన్సర్ రోగుల సంఖ్యం ఏటా పెరుగుతున్నది. ప్రభుత్వ ప్రధాన దవాఖానతోపాటు వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో ఏటా చికిత్స పొందుతున్న రోగులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. మూడేళ్లలో రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2022 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని మూడు ప్రైవేట్ క్యాన్సర్ దవాఖానల్లో 96వేల మందికి పైగా చికిత్స పొందినట్టు తెలుస్తున్నది. చల్మెడ ఆనందరావు క్యాన్సర్ దవాఖానలోనే అత్యధికంగా రోగులు చికిత్స పొందుతున్నారు. ఆ తర్వాత ఒమేగా, ప్రతిమ హాస్పిటళ్లలో రోగులు ఉన్నారు. మూడేళ్లలో చల్మెడలో 76,759 మంది, ఒమేగాలో 11,152 మంది, ప్రతిమలో 8,822 మంది చికిత్స పొందినట్టు తెలుస్తున్నది. ఇక ప్రభుత్వ దవాఖానలో చూస్తే 2022లో 139 మంది, 2023లో 142 మంది, 2024లో ఇప్పటి వరకు 140 మంది చొప్పున మొత్తం 421 మంది చికిత్స పొందినట్టు తెలుస్తున్నది. అంటే, వ్యాధి ఎంతలా విస్తరిస్తున్నదో ఈ నివేదికలను బట్టి అర్థమవుతుంది. క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటేటా పెరుగుతున్న క్రమంలో స్థానికంగా ప్రభుత్వ వైద్యం పూర్తి స్థాయిలో అందుబాటులో లేక నిరుపేద రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకుంటే ఆర్థిక భారం తప్పడం లేదు. క్యాన్సర్ సోకిన నిరుపేదలైతే చికిత్స చేయించుకునే స్థోమత లేక, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ దవాఖానలకు వెళ్లలేక మృత్యువాత పడుతున్నారు. చికిత్స పొందుతున్న రోగుల్లో ఏటా 2 నుంచి 3 శాతానికి మించి మరణాలు సంభవిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.




కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన పాలియేటివ్ కేర్ సెంటర్

## ఇక్కడే సదుపాయాలు ఉంటే..

క్యాన్సర్ మునుపటిలా ప్రాణాంతకం కాదు. మొదటి దశలో గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే నయమయ్యే అవకాశమున్నది. వైద్య విధానంలో అభివృద్ధి చెందిన అనేక అంశాలు ఇప్పుడు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఈ వ్యాధి బారిన పడ్డ రోగులెందరో సకాలంలో గుర్తించబడి ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన అనేక మంది మహిళలకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయి. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు మహిళల్లో ఉన్న రుగ్మతలను గుర్తించి ప్రభుత్వ వైద్యులకు సిఫారసు చేస్తున్నారు. అయితే, వారికి ఇక్కడి ప్రభుత్వ దవాఖానలో పూర్తి స్థాయిలో వైద్యం అందించే పరిస్థితి లేక వరంగల్, హైదరాబాద్ దవాఖానకు రెఫర్ చేస్తున్నారు. చాలా మంది అక్కడికి వెళ్లలేక వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడు సరైన చికిత్స అందిస్తేనే రోగులు ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుంది. అందుకు తగిన వైద్య సహాయం ప్రభుత్వ పరంగా లేకపోవడం, ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక పోవడంతో మహిళలు చాలా మంది క్యాన్సర్ వ్యాధిని పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మహిళల్లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఒరాల్ క్యాన్సర్ వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇక పురుషుల్లోనూ స్కిన్, బోన్, గొంతు, స్టమక్, పెద్దపేగు వంటి క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు మహిళల్లోనూ ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తున్నది. ఇలాంటి ప్రమాదకరమైన వ్యాధికి ఇక్కడే చికిత్స అందుబాటులో ఉంటే బాగుండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

## సూపర్ స్పెషాలిటీ సేవలు ఉంటే..

ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేంద్ర బిందువైన కరీంనగర్‌లో క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేయాలనేది చాలా కాలంగా వస్తున్న డిమాండ్. ఇప్పటికే ఇక్కడ జీజీహెచ్‌లో పాలియేటివ్ కేర్ సెంటర్ ఉంది. ఇక్కడ చికిత్స పొందేందుకు చివరి స్టేజీలో ఉన్న రోగులు వస్తున్నారు. ఇక్కడ వీరికి పూర్తి స్థాయిలో వైద్యం అందించే పరిస్థితి లేక ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. అక్కడికి వెళ్లలేని కొందరికి ఉన్నంతలో చికిత్స అందిస్తూ ఆయుషు పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాన్సర్ చికిత్స అందించేందుకు వైద్య విధానంలో పలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా క్యాన్సర్‌ను ఉన్న స్టేజీలోనే ఉంచే విధంగా పాటి కీమోథెరపీ, నయం చేసేందుకు ఇమ్యూనోథెరపీ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలు కరీంనగర్ జిల్లా కేంద్రంగా ఉన్న ప్రైవేట్ దవాఖానల్లో లభిస్తున్నాయి. కానీ, ఖర్చుతో కూడుకున్నదైనందున పేదలు అక్కడికి వెళ్లలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు అనుబంధంగా క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేస్తే నిరుపేదలకు ఉచిత వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ప్రతిపాదనను పరిశీలించి తక్షణమే ఇక్కడ క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

## ప్రతిపాదనలు పంపించాం

క్యాన్సర్ రోగులు పెరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్‌లో సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటుకు కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించాం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి కూడా ప్రతిపాదించాం. జిల్లా కేంద్రంలో ఈ సదుపాయం ఉంటే ఎందరో పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది. మా ప్రతిపాదన మేరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అనుకుంటున్నాం. క్యాన్సర్‌కు పూర్తి స్థాయిలో ప్రభుత్వ వైద్యం అందిస్తే నిరుపేద రోగులపై ఆర్థిక భారం పడకుండా ఉంటుందని ప్రభుత్వానికి నివేదించాం.



**- డాక్టర్ గుండా వీరారెడ్డి, జీజీహెచ్ కరీంనగర్ సూపరింటెండెంట్**

**మూడేళ్లలో క్యాన్సర్ రోగుల వివరాలు**

| సంవత్సరం | ప్రైవేట్ దవాఖానలు | ప్రభుత్వ దవాఖాన | మొత్తం |
|---|---|---|---|
| 2022 | 28,964 | 139 | 29,103 |
| 2023 | 34,035 | 142 | 34,177 |
| 2024 | 33,733 | 140 | 33,873 |
| మొత్తం | 96,733 | 421 | 97,154 |



ధర్మారం: మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

# పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

కరీంనగర్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన రెండు రోజుల టోకెన్ సమ్మెను శుక్రవారం ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాల వద్ద టెంట్లు వేసుకుని దీక్షల్లో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, బకాయిలు చెల్లించాలన్నారు. పంచాయతీలో చేస్తున్న పనులకు తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కలెక్టర్ పమేలాకు యూనిసెఫ్ ప్రశంసలు



ప్రశంసా లేఖను అందుకుంటున్న కలెక్టర్

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 27 : కలెక్టర్ పమేలా సత్పతికి యూనిసెఫ్ నుంచి ప్రశంసలు లభించాయి. ఈ మేరకు యూనిసెఫ్ రాష్ట్ర వాష్ స్పెషలిస్టు వెంకటేశ్ లేఖను శుక్రవారం కలెక్టర్‌కు అందజేశారు. జిల్లాలో పలు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ, వాటిని విజయవంతంగా కొనసాగిస్తుండడాన్ని గుర్తించి కలెక్టర్‌ను యూనిసెఫ్ మూడు రాష్ట్రాల చీఫ్ జిలాలెమ్ బీటఫస్సీ అభినందించారు. ప్రధానంగా పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి పలు రకాల బీమా సౌకర్యం కల్పించడం, ఆరోగ్య కార్డుల పంపిణీ, వైద్య పరీక్షల శిబిరాలు ఏర్పాటు చేయడం, రక్షణ కవచాలు అందించి, పని చేస్తున్న సందర్భంలో వాటిని విధిగా వాడుకునేలా ప్రోత్సహించడాన్ని గమనించి, కార్మికుల సంక్షేమంపై కలెక్టర్‌కున్న చిత్తశుద్ధిని అభినందిస్తూ లేఖ విడుదల చేసినట్లు వాష్ స్పెషలిస్ట్ వెంకటేశ్ తెలిపారు. ఇదే సహకారం తర్వాతికాలంలో కూడా అందించాలని లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర కన్సల్టెంట్ ఫణీంద్ర కుమార్, జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్‌కు వచ్చి మృత్యుఒడికి

- అమ్మమ్మ ఊరిలో లారీ ఢీకొని బాలుడి మృతి
- సైకిల్ పై వెళ్తుండగా ప్రమాదం
- మల్యాల, శాత్రాజుపల్లిలో విషాదం



సాత్విక్ (ఫైల్)

వేములవాడ రూరల్/ చందుర్తి, డిసెంబర్ 27 : క్రిస్మస్ వేడుకల కోసం అమ్మమ్మ ఊరికి వచ్చిన బాలుడు అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరాడు. ఇంటి నుంచి కిరాణాషాపునకు వెళ్లిన నిమిషాల్లోనే లారీ ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలం మల్యాలకు చెందిన సంటి రాజు-సరిత రెండో కొడుకు సాత్విక్ (12) క్రిస్మస్ వేడుకల కోసం బుధవారం అమ్మమ్మ ఊరైన శాత్రాజుపల్లికి వచ్చాడు. అమ్మమ్మ, తాతతో పండుగ సంబురంగా జరుపుకొన్నాడు. గురువారం ఉదయం 10గంటల తర్వాత తాత ఎడ్ల చంద్రయ్య మనుమడు సాత్విక్‌ను మల్యాలకు తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే పత్తి కొనేందుకు వ్యాపారి రాగా, కాంటా పెట్టిన తర్వాత వెళ్దామని చెప్పాడు. దాంతో సాత్విక్ తినుబండారం కొనేందుకు తన తాత సైకిల్‌పై కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అంతలోనే వేములవాడ నుంచి కొండగట్టు వైపు వెళ్తున్న లారీ సాత్విక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. అయితే లారీ ఆపకుండా వెళ్లడంతో గ్రామస్తులు వెంబడించి వట్టెంల శివారులో పట్టుకున్నారు. మృతదేహాన్ని వేములవాడ ఏరియా దవాఖానకు తరలించగా, నిమిషాల వ్యవధిలోనే బాలుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని కుటుంబసభ్యులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. మరో గంటయితే తల్లిదండ్రుల వద్దకు వెళ్లేవాడంటూ రోదించారు. మృతదేహాన్ని వేములవాడ పట్టణ ఎస్ఐ రమేశ్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# తప్పుడు కేసులకు భయపడేది లేదు

- గోదావరిఖని, మంచిర్యాల ఏసీపీలు పోలీస్ వ్యవస్థనే అపహాస్యం చేస్తున్నారు
- కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు వెళ్లి శాలువాలు కప్పించుకుంటున్నారు
- ఆ శాఖకు మచ్చ తీసుకు వస్తున్నారు
- తప్పుడు కేసులపై డీజీపీ, సీఎం, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, డిసెంబర్ 27: అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో పని చేస్తూ పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఘాటుగా విమర్శించారు. అయినా ఆ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు నమోదు చేసిన కేసులు, కాంగ్రెస్ నాయకుల ఇండ్లకు వెళ్లి శాలువాలు కప్పించుకోవడంపై డీజీపీకి, సీఎం, గవర్నర్, చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు చేస్తామని, అలాగే వీటన్నింటిపై అన్ని వేదికలను ఆశ్రయిస్తామని చెప్పారు. మంథనిలోని రాజగృహలో శుక్రవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖని, మంచిర్యాలలో ఏసీపీలు పోలీస్ వ్యవస్థనే అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక వార్డు మెంబర్‌గా కూడా గెలువలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ నాయకుడి ఇంటికి వెళ్లి మరీ శాలువాలు కప్పించుకోవడమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఆ ఇద్దరు వ్యవహరించిన తీరు పో లీస్ శాఖకే మచ్చ తెచ్చిపెట్టేలా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరి పేర్లు చెప్పితే ఆ బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న రామగిరి మండలానికి చెందిన పూదరి సత్యనారాయణగౌడ్‌పై ఆరు నెలల కాలంలో తొమ్మిది కేసులు నమోదు చేశారని, ఒక్కటే అంశంపై నాలుగు కేసుల ను బుక్ చేశారన్నారు. ఒకే అంశంపై కేసులు పెట్టవద్దనే నిబంధన ఉన్నప్పటికీ ఆ ఏసీపీలు బేఖాతరు చేశారన్నారు. కోర్టులు, వ్యవస్థలు ఉన్నాయనే విషయాన్ని మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, మంథనిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించడం సరికాదని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పోతుపెద్ది కిషన్‌రెడ్డి, శంకెసి రవీందర్, జక్కుల ముత్తయ్య, పూదరి సత్యనారాయణగౌడ్, గుజ్జుల రాజిరెడ్డి, నూనె కుమార్, మాచిడి రాజుగౌడ్, కాయితి సమ్మయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్నయి.. పట్టించుకోండి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కొడిమ్యాల, డిసెంబర్ 27: గ్రానైట్ లారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో ధ్వంసమై తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు శుక్రవారం చెప్యాలలో నిరసన తెలిపారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో గల గ్రానైట్ క్వారీ నుంచి బండ లోడ్‌తో అతివేగంగా పూడూర్ వైపు వెళ్తున్న లారీ చెప్యాలలోని డబుల్ బెడ్రూం ఇండ్ల పక్కనే ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు మూడు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టగా ధ్వంసమై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా, లారీ ఢీకొన్న ఘటనలో ధ్వంసమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో పాత ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంతో తరచూ బ్రేక్ డౌన్ సమస్య వస్తున్నది. దీంతో 80 నుంచి 100 మంది రైతులకు సంబంధించిన పొలాలు తరచూ బ్రేక్ డౌన్ కావడంతో నీరందక ఎండుతున్నాయి. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో మల్యాల ఏడీ మహేందర్‌ను వివరణ కోరగా, అదనంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం నివేదిక పంపామని, మంజూరు కాగానే ఏర్పాటు చేస్తామని చెప్పారు.